క్లుప్తంగా

ఏఎంసీ వైస్ చైర్మన్, డైరెక్టర్ల రాజీనామా



రాజీనామా పత్రం అందజేస్తున్న కండె గంగయ్య

కురిచేడు: దర్శి ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, డైరెక్టర్లు దేవరకొండ వెంకటేశ్వర్లు, అడుసుమల్లి రాజ్యలక్ష్మి, ముక్తిపూడి జెమిమియాలు తమ పదవులకు శుక్రవారం రాజీనామా సమర్పించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నామినేటెడ్ పదవులకు రాజీనామాలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాల మేరకు రాజీనామా సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వారి రాజీనామా పత్రాలను దర్శి ఏఎంసీ కార్యదర్శికి అందజేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

గిద్దలూరు రూరల్: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో నగర పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, శానిటేషన్ పనులు మొత్తం 25 పనులకు సంబంధించి కౌన్సిల్ తీర్మానం చేశారు. అందరం కలిసికట్టుగా నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ వెంకట సుబ్బయ్య అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వి.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతాదీపికా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ నీలోఫర్

బేస్తవారిపేట: స్థానిక ఇస్లాంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలోఫర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త షేక్ శంషాద్‌బీ, తల్లులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

ఒంగోలు టౌన్: నగర శివార్లలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానిక రైల్వే ఫ్లై ఓవర్ సమీపంలోని పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మరణించిన గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడికి 35 ఏళ్ల వయసు ఉంటుంది. అతడు చనిపోయి 10 రోజులై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉంది. సమాచారం తెలిసిన వెంటనే తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

కంభం: పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కంభం సీఐ జె. రామకోటయ్య అన్నారు. ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండగను జరుపుకోనున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బక్రీద్ పండగను అందరు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. గోవధ నిషేధం అమల్లో ఉన్న నేపథ్యంలో ఎవరూ గోవధకు పాల్పడకూడదన్నారు. ఎవరైన అక్రమంగా గోవధ చేస్తూ పట్టుబడితేక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఎస్సై పులి రాజేష్ పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక సీతారామపురంలో వేంచేసి ఉన్న శ్రీ వేప అంకమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు పవన్ కుమార్ గర్భాలయంలో అంకమ్మ తల్లి మూలవిరాట్‌కు పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, వివిధ రకాల పండ్ల రసాలతో పరిమళభరిత ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని చక్కని వస్త్రాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి ప్రత్యేక హారతులు అందజేశారు. అంకమ్మతల్లి అనుగ్రహంతో లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



షాపులో విత్తనాలు పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలను రైతులు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. మండల పరిధిలో బోయిద గుంపులలో విత్తనాలపై రైతులకు అవగాహన చేయడంతో పాటు విత్తనాల దుకాణాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లూజు విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని, నకిలీ విత్తనాలపై జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన విత్తనాల డీలర్ల వద్దే కొనుగోలు చేయాలన్నారు. రశీదుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, గ్రామం పేరు, సంతకం, తేదీలు, విత్తనం రకం పేర్లు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. విత్తనాల షాపుల్లో అందుబాటులో ఏయే రకాల విత్తనాలు, ఎన్ని అందుబాటులో ఉన్నయో స్టాక్ బోర్డుపై రాయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులకు బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు అన్ని వివరాలతో రశీదు తీసుకొని, పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి తప్ప గ్రామాలకు వచ్చే వారి విడి విత్తనాలు తీసుకోవద్దని చెప్పారు. డీలర్లు, ఇతరులు ఎవరైనా నకిలీ విత్తనాలు గ్రామాల్లో విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల్లో స్టాక్ రిజిస్టర్, విత్తనాల ప్యాకెట్లపై ఉన్న లాట్ నంబర్, బిల్ బుక్, తదితర వాటిని ఏఓ పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా పునీత ఆంథోని వారి మహోత్సవం

దొనకొండ: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పునీత ఆంథోని వారి మహోత్సవం విచారణ గురువు ఫాదర్ గుడిపల్లి థామస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి నెల్లూరు మేత్రాసనం వికార్ జనరల్ ఫాదర్ జోసఫ్ మణి ముఖ్య అతిథిగా హాజరై దివ్యబలి పూజ సమర్పించారు. ఉదయం నుంచి పిల్లలు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చి దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునీత ఆంథోని వారి జీవితంలోని అద్భుత విషయాలను ఆయన ప్రసంగించారు. అనంతరం పునీత ఆంథోని వారి తేరును పుష్పాలతో, విద్యుత్ దీపాలతో యువకులు అలకంరించారు. రాత్రి విచారణ క్రైస్తవులు పుర వీధుల్లో మేళతాళాలతో గీతాలాపన చేస్తూ బాణాసంచా కాలుస్తూ ఊరేగింపుగా ఉత్సవం చేశారు. విచారణ గురువులు థామస్, ఇతర గురువులు, సెయింట్ ఆన్స్ కాన్వెంట్ సిస్టర్స్, విచారణ క్రైస్తవులు పాల్గొన్నారు.



అలంకరణలో పునీత ఆంథోని వారి స్వరూపం

చిన్నగుడిపాడులో చోరీ



వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

దొనకొండ: మండలంలోని పెదన్నపాలెం పంచాయతీ చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన చౌదల కృష్ణారెడ్డి ఇంట్లో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. బీరువాను ఊరి బయటకు తెచ్చి పగలకొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదు, 3 సవర్ల బంగారు గొలుసును దొంగలించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు సంఘటన స్థలం పరిశీలించి వివరాలు సేకరించారు. మార్కాపురం క్లూస్ టీమ్ వేలి ముద్రలు సేకరించారు. కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు.

కుటుంబ వైద్య సేవలు వినియోగించుకోవాలి

ముండ్లమూరు: గ్రామాల్లో దీర్ఘకాలిక రోగులకు అందిస్తున్న కుటుంబ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నాయుడుపాలెం సచివాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అవసరమైన మేర మందులు పంపిణీ చేశారు. రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేశారు. రోగులకు అవసరమైన మేర తగిన సలహాలు, సూచనలు చేశారు. సిబ్బంది ఎస్‌కేఎంఎం సుభానీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

నేటి నుంచి స్కిల్ కోర్సులు ప్రారంభం

యర్రగొండపాలెం: స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో శనివారం నుంచి రెండు స్కిల్ కోర్సులు ప్రారంభించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ నాయుడు తెలిపారు. సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సు, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించామని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసినవారితో పాటు టెన్త్ ఉత్తీర్ణులు కాని వారు కూడా అడ్మిషన్ పొందవచ్చని, స్కిల్ హబ్‌కు బి.విజయకుమారి కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. మూడు నెలల కాల వ్యవధి గల ఈ కోర్సుల్లో చేరగోరు వారు సెల్ నంబర్: 95539 45387, 70131 82284, 63022 20609 నంబర్లను సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

పర్యావరణాన్ని కాపాడటంలో విద్యార్థులు ముందుండాలి



విద్యార్థులకు వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్న సురేష్

కొమరోలు: పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడడంలో విద్యార్థులు ముందుండాలని కొమరోలు గ్రామ సచివాలయ కార్యదర్శి కె.సురేష్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎకోక్లబ్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యర్థాలను తగ్గించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రీన్ టీచర్ ఎ.విశ్వరూపం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇళ్లు, పాఠశాల, కార్యాలయాలు, దేవాలయాలు, రహదారులు మొదలగు ప్రాంతాల్లో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. పునర్వినియోగానికి వీలైన వ్యర్థాలను తిగిరి వినియోగించుకోవడం, ఎరువులుగా మార్చుకోవడం చేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు నిర్మల్‌కుమార్, రహమత్, విజయ్‌కుమార్, మహాదేవి పాల్గొన్నారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

● రూ.24,640 నగదు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో ఎస్సై రెహమాన్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని నాగులవరం రోడ్డులో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, నిందితుల నుంచి 24,640 రూపాయల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది

కంభం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పుస్తకాలు, బ్యాగులు, బెల్టు, నోటు పుస్తకాలను శుక్రవారం నుంచి ఆయా పాఠశాలలకు పంపించే కార్యక్రమం ప్రారంభించారు. స్థానిక గురుకుల పాఠశాలకు మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన పుస్తకాలు చేరుకోగా కార్యాలయ సిబ్బంది వాటిని పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు వారిగా వేరు చేసి సంబంధిత పాఠశాలలకు అందజేస్తున్నారు. బ్యాగులు, బెల్టులు, నోటు పుస్తకాలు ఎమ్మార్సీ కార్యాలయంలో అందుబాటులో ఉండగా అక్కడి నుంచి ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్తున్నారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్ పద్మావతి, కంప్యూటర్ ఆపరేటర్ శేఖర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అర్థవీడు (బేస్తవారిపేట): మండలంలోని నాగులవరం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నారాయణరెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం

ఒంగోలు మెట్రో: స్థానిక డ్రీమ్ వ్యాలీలో వేంచేసి ఉన్న గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్లకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. అర్చక స్వాములు గర్భాలయంలో మూల విరాట్లకు పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, వివిధ రకాల పండ్ల రసాలతో పరిమళ భరిత ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను చక్కని వస్త్రాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. భక్తులకు కర్పూర హారతితో దివ్యదర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆరు గంటలకు గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వాముల కళ్యాణ మహోత్సవాన్ని బ్రహ్మశ్రీ సానల సాంబశివరావు, ఝాన్సీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మ ప్రచార పరిషత్ బృందం వారిచే భజన సంకీర్తన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వేద పండితులు బ్రహ్మశ్రీ ఇంకొల్లు మధుసూదనాచార్య, బ్రహ్మశ్రీ కుమారస్వామి, బ్రహ్మశ్రీ యేల్చూరి ప్రదీప్ శాస్త్రి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పురోహితులు

వైభవంగా అనంత కోదండరామస్వామి వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: ఒంగోలు సర్వేరెడ్డిపాలెంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత అనంత కోదండరామస్వామి వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు వేద పురోహితులు పరాంకుశ కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పరాంకుశ చక్రవర్తి, రంగస్వామి, సమీర్ కుమార్‌లు స్వామివారి మూలవిరాట్లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను చక్కని పట్టువస్త్రాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి మంగళహారతితో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం పది గంటలకు దేవేరులకు నిర్వహించిన శాంతి కళ్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. దేవస్థాన ఆవరణలో చూడచక్కని కళ్యాణ వేదిక ఏర్పాటు చేసి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి అర్చక స్వాములు కళ్యాణాన్ని ఆద్యంతం కడురమణీయంగా నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులకు గజవాహనంపై మేళతాళాలతో రామనామ సంకీర్తనలతో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల అనుగ్రహానికి పాత్రులయ్యారు.



గజవాహనంపై దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణులు



ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెద్దదోర్నాల: మండల ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ వైద్యుడు సంజీవ్ పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాలు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో డయేరియా, మలేరియాతో పాటు విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సంబంధించి జ్వర పీడితుల నుంచి రక్త పూత నమూనాలు సేకరించి నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రమేష్‌బాబు, సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు

● స్కూల్ బస్‌లపై పది రోజుల స్పెషల్ డ్రైవ్
● ఎంవీఐ రవికుమార్

దర్శి: స్కూల్ బస్‌లు ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎంవీఐ రవికుమార్ హెచ్చరించారు. డీటీసీ ఆర్. సుశీల ఆదేశాల మేరకు దర్శి ఎంవీఐ కార్యాలయం పరిధిలో స్కూల్ బస్‌లపై 10 రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంలో భాగంగా శుక్రవారం నాలుగు బస్‌లకు రూ.90 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ స్కూల్ బస్ డ్రైవర్‌కు లైసెన్స్, ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్యాక్స్‌లు తప్పని సరిగా కట్టాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో స్కూల్ విద్యార్థులను ఎక్కించినా, లైసెన్స్ లేని డ్రైవర్‌లు స్కూల్ బస్‌లు తోలినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వాహనాలు తోలే వారు సీట్ బెల్ట్‌లు తప్పని సరిగా పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. నిబంధనలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



స్కూల్ బస్‌లు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

మురుగు కాలువల్లో పూడిక తీయాలి

కొమరోలు : మురుగు కాలువల్లో పూడిక సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆ ప్రాంత వాసులు, వందల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం కొమరోలు బీసీ కాలనీ ఎస్‌బీఎన్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాల, ఎస్సీ హాస్టల్ సమీపంలో ఉన్న మురుగు కాలువతో స్థానిక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువలో నీరు స్తంభించి పోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న విధంగా ఉంది. సంబంధిత అధికారులకు పలుమార్లు పాఠశాల యాజమాన్యం, స్థానిక ప్రజలు విన్నవించుకున్నా సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు అడుగులు వేయడం లేదు. ఈ సమస్యతో పాఠశాలలో చదివే విద్యార్థులు రోగాలబారిన పడే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మురుగు కాలువలో స్తంభించిన మురుగు

గోవులను చంపితే కఠిన చర్యలు

మార్కాపురం: బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధిస్తే గోవధ నిషేధ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. గోవధను ప్రభుత్వం నిషేధించిందన్నారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయుడు రక్తదానం

కొత్తపట్నం: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలు స్పందన హాలులో శుక్రవారం రెడ్‌క్రాస్ వారు నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు రక్తదానం చేశారు. కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా కోటేశ్వరరావు పనిచేస్తున్నారు. తాను రెండోసారి రక్తదానం చేసినట్లు ఆయన చెప్పారు. రక్తదానం చేసినందుకు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, స్కూల్ ఉపాధ్యాయులు అతన్ని అభినందించి ప్రశంసపత్రం అందజేశారు.



రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు